సాక్షి
సూర్యాపేట
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023





లింగమంతుల స్వామిని దర్శించుకుంటున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు



ఓ లింగా.. అంటూ శిగమూగుతున్న మహిళ



భక్త జన గట్టు



భక్తజనంతో నిండిపోయిన పెద్దగట్టు పరిసరాలు

దురాజ్‌పల్లి పెద్దగట్టు జనసంద్రాన్ని తలపించింది. లింగమంతుల స్వామి జాతరలో భాగంగా రెండవ రోజు సోమవారం భక్తులు స్వామి, అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు తరలివచ్చారు. భేరీ చప్పుళ్లు, గంపలు, బోనాలతో మహిళలు, శివ సత్తుల నృత్యాలు, ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో గొల్లగట్టు పరిసరాలు మార్మోగాయి. లింగన్న దర్శనానికి భక్తులు బారులుదీరారు.

- సూర్యాపేట, చివ్వెంల

- వివరాలు 10లో▸

న్యూస్‌రీల్

అలసత్వం వహించొద్దు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

కోదాడ: వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే వినతుల విషయంలో ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించాలని, సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని కలెక్టర్ వెంకట్రావు కోరారు. సోమవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కోదాడ పట్టణంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. లింగమంతుల జాతర అనంతరం ప్రతి మండలాన్ని సందర్శించి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా పని చేయిస్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కిశోర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించడంలో విఫలం

చివ్వెంల (సూర్యాపేట) : జాతర అభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెప్పి కనీసం భక్తులకు నీటి వసతి కల్పించడంలో మంత్రి జగదీశ్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు నీటి వసతి లేక పక్కనే ఉన్న బోర్ల నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారని, భక్తుల వాహనాలను దూర ప్రాంతంలో నిలిపివేసి బారికేడ్లను ఏర్పాటు చేయడంతో గుట్ట సమీప ప్రాంతాల్లో నీటి ట్యాంకులు ఏర్పాటు చేసిన ప్రదేశానికి భక్తులు చేరుకోలేక స్వామివారికి మొక్కులు చెల్లించక వంటలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత జాతరలో మున్సిపాలిటీ అధికారులు శానిటేషన్ పేరిట రూ.44లక్షలతో కొనుగోలు చేసిన క్లీనింగ్ మిషన్(జెట్టింగ్ మిషన్) ప్రస్తుతం జాతరలో కనిపించడం లేదన్నారు. గత నాలుగు జాతరల్లో హుండీ ద్వారా, టెండర్ల ద్వారా వచ్చిన ఆదాయం ఏమి చేశారో లెక్క తేల్చాలన్నారు. మంత్రి జగదీశ్ రెడ్డి గెలిచాక లింగమంతుల స్వామి జాతరకు రూ.18కోట్ల నిధులు వస్తే కనీసం శాశ్వత పనులు చేయలేదన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి మహాక్షేత్రంలో శ్రీ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సోమవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్య అగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రసరమ్యంగా రక్తికట్టించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ తదితర కార్యక్రమాలతో కల్యాణతంతు ముగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

రైతులకు చేయూత

- రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ రంగాలకు పెద్దపీట
- రైతు రుణమాఫీకి నిధుల కేటాయింపుతో 1.25లక్షల మందికి లబ్ధి
- 10 వేల ఎకరాల్లో పామాయిల్ సాగు పెంచేలా ప్రణాళిక
- దళితబంధు ద్వారా మరో 2వేల మందికి ప్రయోజనం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారు. ఈ బడ్జెట్‌లో నేరుగా జిల్లాకు ఉపయోగపడే విధంగా కేటాయింపులేమీ లేకున్నా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు దళితబంధు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధికి నిధుల కేటాయింపులు చేయడంతో జిల్లాలో కొంత మేర లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే రైతు బంధు ద్వారా కర్షకులు లబ్ధిపొందుతున్నారు. ఇక రైతు రుణమాఫీకి ప్రత్యేక నిధులు ప్రకటించడంతో జిల్లా రైతులకు రుణ విముక్తి కలిగే అవకాశం ఉంది. ఇక నిరుద్యోగ భృతి వంటి అంశాలు బడ్జెట్‌లో ప్రస్తావనకు రాలేదు. సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు కేటాయిస్తామని ప్రకటించించడంతో కొందరి సొంతింటి కలనెరవేరనుంది.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రాధాన్యం..



దళిత బంధుతో పాటు ప్రత్యేక ప్రగతికి నిధుల కేటాయించారు. అయితే జిల్లాలో సుమారు 52వేల దళిత కుటుంబాలు ఉండగా 2,08,326 దళితులు ఉన్నారు. దళిత బంధు కింద జిల్లాలో 2,588 మందికి ఇప్పటికే లబ్ధిచేకూరగా మరో సారి నిధుల కేటాయింపుతో జిల్లాలో నియోజకవర్గానికి 500 మంది చొప్పున మరో 2వేల మందికి ప్రయోజనం కలగనున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రత్యేక నిధుల కేటాయింతో భారీగా సబ్సిడీ రుణాలు అందే అవకాశం ఉంది. ఎస్టీ ప్రత్యేక ప్రగతికి రూ. 15,223 కోట్ల కేటాయింపుతో జిల్లాలో 35 వేల గిరిజన కుటుంబాలు ఉండగా 1,41,271 మంది గిరిజనులు ఉన్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో ఎస్టీలకు కొంత మేర మేలుకలగనుంది. ఇక జిల్లాలో 83 శాతం జనాభాకు పైగా ఉన్న బీసీలపై ప్రభుత్వం చిన్న చూపు చూసింది. రాష్ట్రబడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేటాయింపులు తక్కుగా చేశారు. దీంతో సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్న బీసీ కుటుంబాలకు నిరాశ తప్పదు. ఇక జిల్లాలో 77 వేల మంది మైనార్టీలకు మరో సారి నిరాశే మిగిలింది.

నియోజకవర్గానికి 2వేల ఇళ్లు



రెండు పడక గదుల ఇళ్ల పథకం ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలో 5 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా కేవలం 475 ఇళ్లను పంపిణీ చేశారు. అయితే గత అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు.. సొంత స్థలంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. అయినా నేటికీ అమలు కాలేదు. కానీ ప్రస్తుత అసెంబ్లీ సమావేశంలో కూడా సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం చేస్తామని, నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు నిర్మిస్తామని మరోసారి ప్రకటించారు. కానీ ప్రత్యేకంగా నిధుల కేటాయంపు లేదు. ప్రకటన అమలులోకి వస్తే జిల్లాలో సుమారు 30 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఇక నిరుద్యోగులకు భృతి ప్రకటించకపోవడంతో సుమారు 1.25లక్షల మందికి నిరాశ తప్పదు.

పామాయిల్ సాగుకు ప్రోత్సాహం



2023–24 సంవత్సరంలో బడ్జెట్‌లో పామాయిల్ సాగును ఎక్కువగా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరం నాటికి 1,370 ఎకరాల్లో పామాయిల్ సాగు చేశారు. మరో 1,130 ఎకరాల్లో సాగుకు సిద్ధం చేశారు. వచ్చే ఏడాది నాటికి సుమారు 10 వేల ఎకరాల్లో పామాయిల్ పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. నిధుల కేటాయింపుతో లక్ష్యం దిశగా నడిచే అవకాశం ఉంది. దీంతో జిల్లాలో సుమారు 3 వేల మంది రైతులకు లబ్ధికలగనుంది.

రుణ మాఫీకి నిధుల కేటాయింపుతో..



రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పించినట్లు ఉంది. రైతు రుణమాఫీకి రూ. 6,385 కోట్లు కేటాయించడంతో రైతులకు రుణ విముక్తి కలుగనుంది. గత ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన రూ. లక్ష లోపు రుణాల మాఫీ హామీ మేరకు ప్రభుత్వం గతంలో ముందుగా రూ. 25వేల లోపు వ్యవసాయ రుణాలు, తరువాత రూ. 50వేల లోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేసింది. రూ. లక్షలోపు రుణాల మాఫీకి అర్హులైన రైతులకు ఇప్పటికీ ఎదురుచూపులే మిగిలాయి. ఇప్పుడు బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో జిల్లాలో రూ. లక్షలోపు వ్యవసాయ రుణాలు ఉన్న సుమారు 1.25లక్షల మంది రైతులకు రుణ విముక్తి కలగనుంది. అదే విధంగా రైతు బంధు పథకం ద్వారా జిల్లాలో ప్రతి సీజన్‌లో 2.90లక్షల మంది రైతులు రూ. 306 కోట్ల మేర లబ్ధి పొందుతున్నారు. అదే విధంగా రైతు బీమా కొనసాగింపులో అకాల మృతి చెందిన రైతుల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. వ్యవసాయ రంగానికి రూ. 26,831 కోట్ల కేటాయింపుతో జిల్లాలో ఉన్న సుమారు 3 లక్షల మంది రైతులకు లబ్ధిచేకూరనుంది.

ప్రజారంజక బడ్జెట్



తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా నిధులు కేటాయించింది. దీంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలకు భారీగా నిధుల కేటాయించి అండగా నిలిచింది. తెలంగాణ బడ్జెట్ దేశానికే మోడల్‌గా నిలుస్తుంది. మహిలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. దళితులు, మైనార్టీల భద్రత, అభ్యున్నతికి అంకితభావంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇది ప్రజారంజక బడ్జెట్.

– గాదరి కిశోర్ కుమార్, ఎమ్మెల్యే, తుంగతుర్తి

నిరాశా జనకం



రాష్ట్ర బడ్జెట్ పూర్తి నిరాశా జనకంగా ఉంది. బడ్జెట్‌లో కేటాయింపులు అంకెల్లో చూపారు. కానీ అమలులో ఆచరణ కాదు. పేదల సొంతింటి కల కలగానే మిగిలే అవకాశం ఉంది. శాఖల వారీగా కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో అందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. పేద, మధ్య తరగతి ప్రజలకిది నిరాశాజనకమైన బడ్జెట్.

–బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి

విద్య, ఆరోగ్యశాఖలకు సరైన కేటాయింపులు లేవు



కోదాడ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య శాఖలకు సరైన కేటాయింపులు లేకపోవడం నిరాశ కలిగించింది. ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి 6.57 శాతం, వైద్యరంగానికి 4.18 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. వాస్తవానికి విద్యారంగానికి 10 శాతం, ఆరోగ్యశాఖకు 12 శాతం నిధులు ఇచ్చినప్పుడే సంక్షేమంతో పాటు ఆరోగ్యవంతమైన మానవ వనరులు అభివృద్ధి చెందుతాయి. దళితబంధుకు నిధుల కేటాయింపు గత సంవత్సరం మాదిరిగానే జరిపినా, ఖర్చు చేయడంలోనే ప్రభుత్వం ఉదాసీనతను ప్రదర్శిస్తోంది. గిరిజన బంధుకు నిధులు కేటాయించక పోవడం ఆ వర్గాలను నిరాశకు గురి చేసింది. ప్రజారవాణా రంగంలో కీలకంగా ఉన్న ఆర్టీసీకి కేవలం రూ.1500 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ సంస్థను ఆదుకోవడానికి ప్రభుత్వం మరికొన్ని నిధులు కేటాయించాల్సింది. వ్యవసాయం, సాగునీటి రంగాలకు కలిపి బడ్జెట్‌లో 18.49 శాతం నిధులు కేటాయించినప్పటికీ ఈ నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేసినప్పుడే ఫలితాలు కనిపిస్తాయి. ఎన్నికల సంవత్సరం కాబట్టి నిరుద్యోగుల భృతికి నిధులు కేటాయిస్తారనుకున్నా మళ్లీ నిరాశే మిగిలిగింది.

–సైదులు, ఆర్థిక విశ్లేషకుడు, కోదాడ

లిఫ్ట్‌లకు నిధులు సరిపోయేదెలా?



గుండెబోయినగూడెంలో కొనసాగుతున్న జాన్ పహాడ్ లిఫ్టు పంపు హౌజ్ పనులు (ఫైల్)

నాగార్జునసాగర్ పరిధిలో సీఎం కేసీఆర్ మంజూరు చేసిన ఎత్తి పోతల పథకాలకు ఈసారి బడ్జెట్‌లోనూ సరిపడా నిధులను కేటాయించలేదు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద పలు పనులకు రూ. 147.73 కోట్లు కేటాయించింది. సీఎం శంకుస్థాపన చేసిన ముక్త్యాల, నెల్లికల్, అంబాభవాని, దున్నపోతుల గండి, బొత్తలపాలెం, కంబాలపల్లి, అయిటిపాముల , కేశవాపురం, జాన్ పహాడ్, పెద్దగట్టు, ఏకే పహాడ్, వీర్లపాలెం, పాగిల్ల, తోపుచర్ల లిఫ్టులకు అధిక మొత్తంలో నిధులు అవసరమని ఇంజనీర్లే చెబుతున్నారు. కనీసంగా రూ. వేయి కోట్లు అవసరమని, అందులో ఒక్క నెల్లికల్ లిఫ్ట్ అంచనా వ్యయయే రూ.664.80 కోట్లుగా పేర్కొంటున్నారు.

కొత్త నిధులతో పాత విధానాలు



హుజూర్‌నగర్: ఉద్యోగులకు హెల్త్ కేర్ ట్రస్ట్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు నిధుల కేటాయింపు వంటి కొన్ని కొత్త అంశాలు ఉన్నా దాదాపుగా పాత విధానాలకు కొనసాగింపుగానే ఈ బడ్జెట్ కనిపిస్తోంది. వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం బడ్జెట్లో ప్రస్ఫుటంగా కనిపించే ప్రశంసనీయమైన అంశం. వివిధ పథకాలకు నిధుల కేటాయింపు ద్వారా అన్ని వర్గాలను సంతృప్తిపరిచే ప్రయత్నం జరిగింది. రానున్న ఎన్నికల దృష్ట్యా కొత్త విధానాలను ప్రారంభించడంలో ఆసక్తి లోపించినట్లుగా అనిపిస్తోంది. అయితే సంక్షేమంతోపాటు అభివృద్ధికి మరింత ప్రాధాన్యతను ఇచ్చే విధంగా బడ్జెట్ ఉంటే ఇంకా బాగుండేది.

– డాక్టర్ చందా అప్పారావు, అర్థశాస్త్ర సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూర్‌నగర్.

రాహుల్ గాంధీ కృషిని వివరించాలి



యాత్రలో మాట్లాడుతున్న వెంకన్న యాదవ్

భానుపురి (సూర్యాపేట) : దేశ సమగ్రత, సమైక్యత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషిని ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని 24వ వార్డులో పట్టణ అధ్యక్షుడు ఎండి అమ్జద్ అలీ అధ్యక్షతన వార్డు బాధ్యులు అన్నమయ్య రాము, చెరుకు రాము, నల్ల మాస సైదులు ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ 480 కిలోమీటర్ల భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. దీనికి కొనసాగింపుగా ప్రతి పౌరుడు రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రతి గడపకు చేరవేయాలని ఉద్దేశంతో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన త్యాగాలను మర్చిపోకుండా ప్రజలకు వివరిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలపరచాలన్నారు. 60 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ఇంటింటికీ ప్రతి కార్యకర్త తిరగాలన్నారు. ఈ కార్యక్రమంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ నియోజకవర్గం కన్వీనర్ ధరావత్ వీరన్న నాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనురాధ, నాయకులు చెంచల శీను, కక్కిరేణి శ్రీనివాస్, కోతి గోపాల్ రెడ్డి, తుమ్మల సురేష్ రావు, వేముల కొండ పద్మ, మాణిక్యం, రంగయ్య, వాసు, జానయ్య, తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, సైదులు, రావుల రాంబాబు, ఎలగందుల సాయి, గొట్టి ముక్కుల నరేందర్ నాయుడు, పటాన్ సమీర్, గార్లపాటి వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వెటరన్ టేబుల్ టెన్నిస్‌లో కోదాడవాసికి సిల్వర్‌మెడల్

కోదాడ: కోదాడకు చెందిన జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు నరసింహరాజు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మాస్టర్స్ నేషనల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో 40 ప్లస్ వెటరన్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. కోదాడలో నీటిపారుదలశాఖలో పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున రెండు సంవత్సరాలుగా జాతీయ సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొంటున్నారు. నరసింహరాజును నీటిపారుదలశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.



నరసింహరాజు

జిల్లా న్యాయసేవా సమితి సేవలు వినియోగించుకోవాలి

- జిల్లా జడ్జి గౌతం ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా న్యాయసేవా సమతి సేవలు కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్ కోరారు. నిరుపేదల కోసం జిల్లా న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో నియామకమైన ముగ్గురు డిఫెన్స్ కౌన్సిల్స్‌కు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లాల్లో రాష్ట్ర న్యాయ సేవా సమితి చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి బి.నవీన్ రావు ఆన్‌లైన్ ద్వారా నియామకాలు చేపట్టారు. ఒక సంవత్సరం పాటు విధులు నిర్వహించనున్న వీరు న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని వారికి తమ సేవలు అందజేస్తారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టుకు సీనియర్ న్యాయవాది వసంత సత్య నారాయణ పిళ్లే యాదవ్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బొల్లెద్దు వెంకటరత్నం,జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు పెండెం వాణి, బి. ప్రవీణ్‌లు ఎంపికయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు జిల్లా పరిధిలో ఉన్న కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ కోర్టుల్లో న్యాయసేవలు అందిస్తారు. ఈ సందర్భంగా వారికి న్యాయవాదులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జిలు కె.సురేష్, జే. ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సినపల్లి సోమేశ్వర్, జిల్లా న్యాయసేవా సమితి సభ్యులు జే.శశిధర్, మారపాక వెంకన్న, ఎడిండ్ల అశోక్ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. శ్రీస్వామివారికి పూజలు చేసిన అనంతరం హోమ మండపంలో అగ్ని ప్రతిష్ఠ చేసి రుద్ర హవనం గావించారు. ఆ తర్వాత పూర్ణాహుతి, మహాశివుడికి అభిషేకం, అర్చనలు, ముఖ మండపంలోని స్ఫటిక లింగానికి పూజలు చేసి, హారతినిచ్చారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలోనూ నిత్య కైంకర్యాలు కొనసాగాయి. సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు చేపట్టారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

కల్యాణ వైభోగమే..



అర్వపల్లి శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం అనంతరం తలంబ్రాలు పోస్తున్న భక్తులు

బోనమెత్తిన పెద్దగట్టు



లింగమంతుల జాతరకు పోటెత్తిన భక్తులు

- చౌడమ్మ తల్లికి బోనాలు సమర్పించిన యాదవ పూజారులు
- భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్‌లు

సూర్యాపేట, చివ్వెంల/దురాజ్‌పల్లి : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి(పెద్దగట్టు) జాతరకు సోమవారం భక్తులు పోటెత్తారు. గట్టుకు నలుదిశలా ఉన్న దారుల నుంచి భక్తులు రావడంతో గట్టు అంతా జనంతో నిండిపోయింది. ఒక్కరోజే 8 లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. స్వామి వారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. జాతరలో రెండవ రోజు ఘట్టమైన చౌడమ్మ బోనాల చెల్లింపు తంతును యాదవ పూజారులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భేరీ చప్పుళ్ల, మంద గంపలు, బోనాలతో ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో శ్రీలింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త కుండల్లో నెయ్యి, పసుపు, కుంకుమతో అమ్మవారికి నైవేద్యం వండి, ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి సమర్పించారు.

బోనాల సమర్పణ ప్రత్యేకత..

సంప్రదాయం ప్రకారం.. హక్కుదారులైన మున్న (రాజులు) మెంతబోయిన (పూజరులు) వంశస్తులు తమ ఇళ్ల నుంచి తెచ్చిన బియ్యంతో రెండు (రాశి, సందర) బోనాలు సమర్పించారు. బైకానివారు వాయిద్యాలు వాయిస్తుండగా మున్న వారు రాశిబోనాన్ని, మెంత బోయినవారు సందర బోనాన్ని మద్దెరపోలు ముందర ఇరువైపులా పెట్టారు. రాశి బోనం నుంచి కొంత అన్నం తీసి తమలపాకుల్లో పెట్టి దేవరపెట్టెకు నలుమూలలా ఉంచారు. అలాగే పాడి పసుపుతో వేసిన ముగ్గుపై రెండు తమలపాలకులతో, తడి పసుపుతో వేసిన ముగ్గుపై రెండు తమలపాలకులతో అన్నం నైవేద్యంగా పెట్టారు. మున్న, మెంతబోయిన వారు రాశి బోనం నుంచి కొంత అన్నం తీసి లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించారు. బైకాని వారు మద్దెరపోలు ముందు తెల్లని వస్త్రాన్ని పరిచి దానిపై పసుపుతో చక్రం ఆకారంలో ముగ్గు వేసి ముగ్గుపై నూనె పూసి పసుపు, కుంకుమతో బొట్లు పెట్టి అలంకరించిన రెండు అవసరాలు (కటార్లు) ఉంచారు. వీటిని ముందుగా హక్కుదారులైన మున్న (రాజులు) వంశస్తులు ఐదుగురు వరుసగా ఓ లింగా.. ఓలింగా.. అని స్మరిస్తూ అవసరాలను పైకెత్తి తమ ఛాతీకి ఇరువైపులా ఆనించుకోగా.. బైకాని వారు కథాగానం చేస్తూ మద్దెరపోలు ముందు మున్న, మెంతబోయిన వంశీయులతో దిబ్బం గడుపుట అనే కార్యక్రమం నిర్వహించారు. బైకాని పూజారి ముందుగా మున్న వంశీయుల మెడలో వీరతాడు వేసి స్వామి వైపు ఉన్న దిబ్బం (మట్టి కంచుడు) పైఉంచి మున్నవారు మెడలోని వీరతాడు కొనలు పట్టుకుని, కంచుడులోని నూనెలో ముంచి, వెలుగుతున్న జ్యోతి చుట్టూ తిప్పి ముద్దెరపోలుకు హస్తాలు ఆనించి మొక్కారు. అలాగే మెంతబోయిన వారు కూడా సౌడమ్మ తల్లి వైపు ఉన్న దిబ్బంపై వంగి, మెడలోని వీరతాడును ఆ దిబ్బం చుట్టూ తిప్పి ముద్దెర పోలుకు హస్తాలు ఆనించి మొక్కారు. ఈ విధంగా బైకాని పూజారులు మున్న, మెంతబోయిన వారి మెడలో వీరతాళ్లు వేసి దిబ్బం మీద ప్రమాణం చేయిస్తే, వారు ఆచారం ప్రకారం లింగమంతుల స్వామి చౌడమ్మ జాతరను నిర్వహిస్తారని నమ్మకం. ముద్దెరపోలు కార్యక్రమం తర్వాత లింగమంతులస్వామి చౌడమ్మ తల్లి ఆలయానికి ఎదురుగా ఉన్న పోచమ్మ పోతరాజుల రాతి విగ్రహాల దగ్గర జంతుబలి కార్యక్రమం నిర్వహించారు. బైకాని వారు కథాగానం చేస్తుండగా తొలి గొర్రె (మెంతబోయిన వారిది), బద్దెపాల గొర్రె (మున్న వారిది), వరద గొర్రె (గొర్ల వారిది)లను చౌడమ్మ తల్లికి ఎదురుగా నిలబెట్టి హక్కుదారులైన మున్న, మెంతబోయిన వారు తమ సంప్రదాయ అవసరాలను గొర్రెలకు ఆనించి మొక్కారు. జడత ఇచ్చిన వెంటనే చౌడమ్మ తల్లికి మొదటగా బైకాని వారు తొలి గొర్రెను కోయగా తర్వాత బద్దె గొర్రెను, వరదగొర్రెను బలిచ్చారు. వరద గొర్రెను కోసేటప్పుడు గొల్లలు బిందెలతో నీళ్ల పోయగా, దాని రక్తం వరదగా ప్రవహించింది. బద్దిపాల గొర్రె రక్తపు చుక్కలను కొత్త కంచుడులో పోసి పాలు, నెయ్యి కలిపి బైకాని వారు మెంతబోయిన వంశీయులలో నిష్ఠతో ఉన్న వారికి తీర్థంగా పెట్టారు. తర్వాత బలిచ్చిన గొర్రెల మాంసాన్ని మున్న, మెంతబోయిన, బైకాని వారు వాటాలుగా పంచుకుని, తమ విడిది ప్రదేశంలో వండుకుని చౌడమ్మ తల్లికి నైవేద్యం పెట్టి మొక్కి భుజించారు. దీంతో బోనాల సమర్పణ ముగిసింది.


దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు జాతరలో భక్తజన సందోహం


జాతరకు గొర్రె పొట్టేళ్లతో వస్తున్న భక్తులు


లింగమంతుల స్వామి దర్శనానికి పెద్దగట్టు పైకివెళ్తున్న భక్తులు


దేవరపెట్టెలో దేవతామూర్తుల విగ్రహాలు

నేడు చంద్రపట్నం

జాతరలో మూడవరోజు మంగళవారం చంద్రపట్నం వేసి స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకోసం యాదవ పూజారులు, దేవాలయ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

భక్తుల జేబులకు చిల్లు

టెండర్‌లో నిర్ణయించిన ధరకు విరుద్ధంగా వ్యాపారులు జాతరలో తినుబండారాలు, కొబ్బరికాయలు విక్రయించారు. కొబ్బరికాయ టెండర్ ధర రూ.40 కాగా రూ.50కు పైగా విక్రయించారు. మిఠాయి కేజీ రూ.200 , బొంగులు డబ్బా రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో సైతం అధిక ధరలు ఉంటుండడంతో నిరాశ చెందుతున్నారు.

జాతరకు కేరాఫ్ మర్రిచెట్టు

పెద్దగట్టు జాతరకు కేరాఫ్‌గా అక్కడి మర్రిచెట్టు నిలుస్తోంది. భక్తులు పెద్ద సంఖ్యలో చెట్టు నీడలో సేదదీరడం కనిపించింది. తప్పిపోయిన వారిని గుర్తించేందుకు వారికి ఒక అడ్రస్‌గా మర్రిచెట్టుగా మారింది. వివిధ శాఖల అధికారులు కలుసుకోవాడానికి వేదికగా మారింది. మొత్తానికి పెద్దగట్టు జాతరకు కేరాఫ్ మర్రి చెట్టు అని భక్తులు పేర్కొంటున్నారు.


వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది


కటార్లతో విన్యాసాలు చేస్తున్న బాలికలు


ఆలయం లోపల బారులుదీరిన భక్తులు

సాంకేతికతను వినియోగిస్తూ.. భక్తులకు భద్రతనిస్తూ..

- పెద్దగట్టు జాతరలో సీసీ, డ్రోన్ కెమెరాల ఏర్పాటు
- తొలిసారిగా ఎఫ్‌ఆర్‌ఎస్ టెక్నాలజీ వినియోగం
- బందోబస్తును పర్యవేక్షిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పేరు గాంచిన శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతరపై పోలీస్ యంత్రాంగం పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. జాతరలో అల్లరిమూకలు, దొంగల ఆగడాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం వరకు ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ జాతర వద్దే ఉండి బందోబస్తును పర్యవేక్షించారు. జాతరలో మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా వ్యవహరించేందుకు షీ టీం, సీసీఎస్‌తో పాటు మఫ్టీ బృందాలు సంచరిస్తున్నాయి. మహిళల పట్ల ఎక్కడైనా అసభ్యకరంగా, అమర్యాదగా ప్రవర్తిస్తే వారిని ఈ బృందాలు అదుపులోకి తీసుకొనున్నాయి. ఈ బృందాల్లోని పోలీసులంతా జాతరకు హాజరయ్యే భక్తుల చుట్టూ తిరుగుతుంటారు. వారితో పాటు బాంబు, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నారు. జాతరలో 60కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతర వద్ద ఓ గూడారంలో సీసీ టీవీలకు సంబంధించిన కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్) టెక్నాలజీతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటికి సుమారు 600 మంది పాత నేరస్థుల జాబితాను అనుసంధానం చేశారు. ఎవరైనా పాత నేరస్థులు జాతరలో సంచరిస్తే ఈ నిఘా నేత్రాలు పసిగట్టి కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేస్తాయి.


సీసీ టీవీలో బందోబసును పర్యవేక్షిస్తున్న ఎస్పీ

జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు

సూర్యాపేట క్రైం : శ్రీ లింగమంతుల స్వామి జాతర సందర్భంగా పోలీసులు జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అందులో భాగంగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విజయవాడ నుంచి సూర్యాపేట మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలను స్వామినారాయణ్ గురుకుల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ రోడ్డు మీదుగా ఖమ్మం జాతీయ రహదారి 365బిబి రోళ్లబండ తండా వరకు మళ్లించి, జాతీయ రహదారి రాయినిగూడెం వద్ద యూటర్న్ చేసి హైదరాబాద్ వైపు పంపిస్తున్నారు.

- విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ, ట్రాన్స్‌పోర్టు వాహనాలను కోదాడ, నేరేడుచర్ల, మిర్యాలగూడ, నల్లగొండ మీదుగా నార్కట్‌పల్లి వద్దకు మళ్లిస్తున్నారు.
- కోదాడ, మునగాల, గుంపుల మీదుగా సూర్యాపేట పట్టణానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర చిన్న ప్రజా రవాణా వాహనాలు ఎస్సారెస్పీ కెనాల్ నుంచి బీబీగూడెం వద్ద నుంచి సూర్యాపేట పట్టణానికి పంపిస్తున్నారు.
- సూర్యాపేట పట్టణం నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రజా రవాణా వాహనాలు కుడకుడ గ్రామం మీదుగా ఐలాపురం వద్ద ఖమ్మం జాతీయరహదారి మీదుగా రాఘవపురం స్టేజి నుంచి నామవరం గ్రామం మీదుగా జాతీయరహదారి 65 పై గుంజలూరు స్టేజి వరకు మళ్లించి కోదాడ, విజయవాడ వైపునకు పంపిస్తున్నారు. అయితే, జాతరకు వెళ్ల వలసిన భక్తులు బస్సులో వస్తేనే సౌకర్యవంతంగా ఉంటుందని పోలీసులు సూచిస్తున్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర పండుగగా గుర్తిస్తాం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల

చివ్వెంల (సూర్యాపేట) : బీజేపీ అధికారంలోకి రాగానే శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. జాతరలో భాగంగా రెండవ రోజు గట్టును సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాగానే సమ్మక్క-సారక్క జాతరను తలపించేలా మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు దేశ రాజకీయాల్లోకి వెళ్లి ఏమి చేస్తారో వేచి చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద కళాకారుల ప్రదర్శన

జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో జాతరలో నిర్వహిస్తున్న జానపద ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. డప్పు కళాకారులు, కోలాట కళాకారులు తమ విన్యాసాలతో భక్తులను మైమరపిస్తున్నారు.


డోలు వాయిస్తూ గట్టుకు వస్తున్న కళాకారులు

ప్రత్యేక ఆకర్షణగా శివసత్తులు


బోనాలతో వస్తున్న శివసత్తులు

జాతరలో శివసత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెత్తిపై బోనం కుండ ఎత్తుకుని ఓ లింగా నామస్మరణతో నృత్యాలు చేస్తూ జాతరలో సందడి చేశారు. జాతరకు వచ్చిన భక్తులు వారి విన్యాసాలను చూసి మంత్ర ముగ్ధులయ్యారు.

రాత్రి వరకు తరలివచ్చిన గంపలు

భానుపురి : లింగమంతుల స్వామి జాతరలో ప్రధానంగా మొక్కుల చెల్లింపులో భాగంగా గంపలు చేయడం అనవాయితీ. ఏటా మధ్యాహ్నం వరకే పూర్తయ్యే కార్యక్రమం ఈ సారి రాత్రి 7, 8 గంటల వరకు కూడా గంపలతో కత్తి కటారుల విన్యాసాలతో గట్టుపైకి భక్తులు తరలిరావడం కనిపించింది. యాదవుల సాంప్రదాయ నృత్యాలు, కత్తి కటారు విన్యాసాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.


గంపలతో వస్తున్న మహిళలు


ట్రాక్టర్‌పై ఇళ్లకు వెళ్లిపోతున్న భక్తులు

ఒక్క రోజుకే తిరుగు ముఖం

పదేళ్ల క్రితం భక్తులు ఎడ్లబండ్లతో జాతరకు వచ్చి మూడు నుంచి నాలుగు రోజులపాటు గుడారాలతో అక్కడే ఉండేవారు. ఈ ఏడు జాతరకు ఆదివారం సాయంత్రం వచ్చిన భక్తులు గంపలు బోనాలు చేసుకొని స్వామి అమ్మ వాళ్లకు అర్ధరాత్రి వరకు చెల్లించుకున్నారు. ఆ తర్వాత యాటలను బలిచ్చి సోమవారం సాయంత్రానికి ఇంటి ముఖం పట్టడం కనిపించింది.

భక్తులందరికీ రెండు చోట్ల షవర్లు

భక్తులదంరికీ ఆలయ ప్రాంగణంలో రెండు చోట్ల మాత్రమే షవర్లు ఏర్పాటు చేశారు. స్నానాలు చేసేందుకు సరిపడా షవర్లు లేక, ఉన్నవి కూడా ఒకే చోట ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు.


కోనేరు వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు


కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

ఎరుపెక్కిన గట్టు..

గొల్లగట్టు ఎర్రబడ్డది. యాదవులు స్వామివారికి కొబ్బరి కాయలు, బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించుకోగా , అమ్మవారికి యాటలు బలి ఇచ్చారు. గతంలో గట్టుకు ఒకవైపు కేటాయించిన ఒక ప్రదేశంలో మాత్రమే యాటలను బలి ఇచ్చేవారు. కానీ ఈ జాతరలో తమకు నచ్చిన చోట గుట్టచుట్టూ యాటలను బలి ఇచ్చారు. దీంతో గుట్ట పరిసర ప్రాంతాల్లో రక్తపు మరకలే కనిపించాయి.


చౌడమ్మకు బోనం సమర్పించేందుకు వస్తున్న మహిళలు


లింగమంతుల స్వామి ఆలయం వెలుపల బారులుదీరిన భక్తులు

యువత ఉత్తమ పౌరులుగా ఎదగాలి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సూర్యాపేటటౌన్: నేటి యువత అమర జవాన్ల జీవితాలను ప్రేరణగా తీసుకొని ఉన్నత విలువలతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పరమవీర చక్ర అవార్డు గ్రహీతలకు పరమవీర వందనం సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టెక్నాలజీని యువత తమ విద్య, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. మనం మారితేనే దేశం మారుతుందని, యువత దానికి మార్గదర్శి కావాలన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలు ఆలోచించాలని, గొప్ప పరిశోధనలు చేస్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్(ఐఎన్‌టీఏసీహెచ్) సెక్రటరీ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. భారత ప్రాచీన సంప్రదాయాలు, విలువలు ప్రపంచమంతా అవసరమై, వివిధ దేశాలు మన దేశ మార్గనిర్దేశం కోసం ఎదురుచూస్తున్నాయని అన్నారు. భారతదేశం ప్రపంచానికి మానవ విలువలను నేర్పిందని, వాటికి మనం ప్రతినిధులుగా మెలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ముత్యాలరాజు, డైరెక్టర్ కిరణ్‌కుమార్, కోఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో సంతోషంగా సబ్బండ వర్గాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


మాట్లాడుతున్న మంత్రి తలసాని, పక్కన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య

కోదాడ: కేసీఆర్ పాలనలో తెలంగాణలోని సబ్బండ వర్గాలు ఆనందంగా ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కోదాడలో నూతనంగా నిర్మించిన లింగమంతుల దేవాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలు, గొల్ల కురుమలకు గొర్రెల యూనిట్లను మంజూరు చేయడంతో వారు ఆర్థికంగా వృద్ధి చెందారని పేర్కొన్నారు. గతంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉండి కనీసం ఒక్క ఇల్లు కూడా కట్టివ్వలేని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడలో 2000 డబుల్ బెడ్‌రూం ఇళ్లను కట్టించిన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యను విమర్శించడం తగదన్నారు. లింగమంతుల దేవాలయం నిర్మించడానికి ఎమ్మెల్యే చేసిన కృషిని మంత్రి అభినందించారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే తదితరులు పాల్గొన్నారు.